కుని దీర్ఘంగా నిట్టూర్చేడు ఎలమంద. తనపెట్టీ బెడ్డింగూ పుచ్చుకుని వీధిలోకి వచ్చేసేడు. దొర గారుగాని, ఆయన భార్యగాని కిమ్మనలేదు. రోడ్డు ఎక్కగానే అడుగు ఎటువైపు వెయ్యాలో బోధపడలేదు ఎలమందకు.

పాత స్నేహితులవద్దకే వెడదామంటే ఏ మొహంపెట్టుకు వెళ్ళేది? ఆఖరున జరిగిన వ్యవహారపులో గుట్టు కామయ్యకు తెలియదా? వాడీ పాటికి చాటించివుండడా? ఏమీ పాలుపోలేదు. వెర్రిమొహంపెట్టుకుని వీధిచివరమైదానంలో కూలబడ్డాడు ఎలమంద.

"ఏంచెయ్యాలి? ఎక్కడికిపోవాలి?" అన్న విషయాన్నిగురించి ఒకగంట ఆలోచించేడు. ఏమీ తట్టలేదు. ఇంతలో కామయ్య వెనుకనుండి వచ్చి, "లే, ఎలమందా"అన్నాడు. ఎలమందలో ఆశ్చర్యమూ, సిగ్గూ పెనవేసుకుని మాట పైకిరాని వ్వలేదు.

"నాకంతా తెలిసిందిలే. నీకేం ఫరవాలేదు. నాబసకి రా"అంటూ బెడ్డింగు తీసుకున్నాడు కామయ్య. విధిలేక ఎలమంద పెట్టెతీసుకుని అనుసరించేడు.

ఆ సాయంత్రం కామయ్య తిరిగితిరిగి ప్రతీ కార్మికునివద్దా నాలుగణాలచొప్పున చందా వసూలుచేసి ఎలమందతో ఇలా అన్నాడు: "ఈ వందరూపాయలూ వాడుకో మళ్ళీ నౌకిరీ వచ్చేదాకా. బెంగపెట్టుకోకు. మా ప్రాణంలాంటి ప్రాణమే నీదీను." ఎలమంద ఆ మాటలు విని గతించిన తన ప్రవర్తన తలుచుకుని కుమిలి పోయాడు. సంఘబలమంటే అప్పుడు బోధపడింది. అతితెలివికీ,తెలివికీగల భేదం స్ఫురించింది.

---

కథానిక

# పెద్దమనుషులు

## చౌదుల వెంకటరత్నం

ఆ వూళ్ళో వెంకట్రామయ్యగారంటే అదోవిధమైన మోజు. ఆమోజును పురస్కరించుకొని వచ్చే ఎన్నికల్లో ప్రెసిడెంటుకైనా పోటీచేస్తానంటాడాయన. కొంతవరకు మిగిలిన కాస్త గౌరవానికిగల కారణం, గతంలో ఆయన నిర్వహించిన రెండు పదవులూను. మునసబు, పంచాయతీబోర్డు ప్రెసిడెంటు రెంటినీ కొన్నాళ్లపాటు నిరాటంకంగా నిర్వహించారు. ప్రపంచ పరిస్థితులతోపాటు ఆయన పరిస్థితీ దిగజారిపోయింది. జరిగిన ఎన్నికల్లో వ్యతిరేకవర్గం ఆయనపై గట్టి దెబ్బతీసింది. పేరుమోగిన భూస్వామి పట్టియ్యగారు ప్రెసిడెంటుగా ఎన్నికయారు. ఈయనతో బాటు ఈయన వర్గంలోని సభ్యులే ప్రతివార్డులోను ఎన్నికయ్యారు. మునసబుగిరీకూడా ఇంకో వెంకన్నకు పదవీదానంచేసేశారు వెంకట్రామయ్యగారు. ఎంత అపజయం ఆవహించినా ఆయన ధైర్యంమాత్రం విడవలేదు. పదవిలేకుండా ప్రజాసేవచేయడం కష్టమనుకునేవారిల్లో ప్రథముడు కాబట్టి పట్టుదలగా సమయంకోసం నిరీక్షిస్తున్నారు. ఆస్తి కాస్తా హారతి కర్పూరంలా ఆరిపోయింది. మిగిలిందల్లా బీటలువారిన మేడ ఒక్కటే. ఈస్థితిలోవున్న మేడను ఏ పోస్టాఫీసుకో అద్దెకివ్వడం మంచిదనే తలంపు ఈ మధ్యే కలిగింది వెంకట్రామయ్యగారికి పదవిలేకపోయినా కచేరీకొచ్చి చాణక్యుని ప్రజ్ఞ వెళ్ళగక్కుతూ వుంటారు తరచు. ఇహ తన జీవితలక్ష్యం ఒకటే ఒక్కటి. అది- పోయిన గౌరవం, ప్రతిష్ఠ పునః ప్రతిష్టించుకోవడం.

ఒకసారి రైతులపై గండిసేరం మోపాడు ఓవర్సీరుగారు. కేసు పెడతాను పెడతానని బెదరించి రైతుల్లో ఏమాత్రం అదురూబెదురూ కనిపించక పోతే ప్రాణం విసిగి కేసు పెట్టేశాడు. ఈ ఆపదను తప్పించే ఆపద్బాంధవుడిలా ఈ విషయంలో జోక్యం కలగజేసుకున్నారు స్థానిక మునసబుగారు. తలకో పదిరూపాయలిస్తే కేసు రద్దు చేయించగలనని మునసబుగారు రైతులకు వాగ్దా

వం చేశారు. ఆ ప్రకారం డబ్బంతా మాటగట్టి మునసబు గార్కి అందచేశారు. కాని, జమాబందీలో ప్రతిరైతుకూ పదిహేను పదిహేను చొప్పున జరిమానాపడింది. మునసబు మోసానికి రైతులు ఆగ్రహంతో ఉడుకెత్తిపోయారు. కోపాగ్ని వెడలగ్రక్కుతుంటూ మునసబుదగ్గరకెళ్ళి "ఇదేం మోసం?"అని నిలదీసి అడిగారు.

"నే చేయవలసిందంతా చేశాను. అది మీ కర్మ" అన్నాడాయన వేదాంతిలా ముఖంపెట్టి.

"ఛీ"అన్నా తుడుచుకుపోయే మునసబుగారు కాబట్టి రైతులంతా ఎవరింటికివారు ప్రశాంతంగా వెళ్లిపోయారు. వచ్చే ఎన్నికల్ని దృష్టిలోపెట్టుకొని మౌనంమంచిది కాదనుకొని వెంకట్రామయ్య గారు సదరు మునసబుగారిని మాటల్లో కొంచెం మందలించారు. కాని మీసాలుమాత్రం నవ్వుతూనే ఉన్నయ్.

ఆ వూరు కోపరేటివ్ సొసైటీ ప్రెసిడెంటు సూరన్నగారు పట్టి చాదస్తం మనిషి. నేనో మానవాతీతుణ్ణి అని వ్యక్తం చేసుకుంటేనేగాని ఆయనకు ఆత్మసంతృప్తి ఉండదు. పలానాపని మీవల్లగాని అవ్వదంటేచాలు చంద్రుణ్ణిమాచిన సముద్రుడిలా పొంగిపోతాడు. ఆయన మనస్తత్వమే అంత. సూరన్నగారికీ వెంకట్రామయ్యగారికీ పరోక్షంగా గాఢమైన స్నేహం. బయటకు ఎడముఖం పెడముఖంగా వ్యవహరించినా ఏదైనా కలిసొచ్చేటప్పటికి యిద్దరూ కలిసిపోతారు. సొసైటీలో ఏ చిన్న ఉద్యోగానికైనా వెంకట్రామయ్య గారి రికమండేషన్ బ్రహ్మాస్త్రంగా పనిజేస్తుంది. ఇది తెలిసి సంసారభారం మీదపడిన కృష్ణమూర్తి వెంకట్రామయ్యగార్ని వేడుకుందా మనుకున్నాడు. అందుకతని అంతరాత్మ ఒప్పుకోలేదు. కృష్ణమూర్తి కొంచెం అభిమాని. ఆత్మాభిమానం దెబ్బతినకూడదు. స్వశక్తిమీదే ఉద్యోగం సంపాదించుకోవాలనుకున్నాడు. అలాగే తన తెలివితేటలన్నీ వినియోగించి ఉద్యోగం సంపాదించగలిగాడు. ఇప్పుడు కృష్ణమూర్తి సొసైటీ మేనేజరు. సొసైటీతాలూకు సమస్త వ్యవహారాలన్నీ కృష్ణమూర్తే సాగిస్తున్నాడు. సొసైటీలోచేరిన తర్వాత కృష్ణమూర్తి నిజాయితీకికొంచెం నీళ్ళొదిలాడు. ప్రత్యక్షంగానూ,పరోక్షంగానూ సొసైటీలో బాగాలాభం తీయగలిగాడు. కృష్ణమూర్తి ప్రదర్శిస్తున్న ప్రజ్ఞకి సూరన్నగారి మనస్సు గాలి కొట్టిన రబ్బరుబెలూనులాగయింది. ఒకసారి పొలంపోతూ ఎదురైన సూరన్నగారిని "ఏమండీ మావాడు సొసైటీలో జాగ్రత్తగా చెప్పినపనల్లా చేస్తున్నాడా?" అని అడిగాడు కృష్ణమూర్తికి పిల్లనిచ్చిన మేనమామ వీరాస్వామిగారు.

"వాడికేమండీ! బంగారం" అన్నాడు సూరన్నగారు అనాలోచితంగా. కృష్ణమూర్తంటే అవ్యాజమైన ప్రేమ ఏర్పడింది సూరన్నగారికి. తనకే తెలియని మమత, మమకారం ఏర్పడిసై. ఒక్కమాటలో చెప్పాలంటే కృష్ణమూర్తి సలహా లేనిదే సూరన్నగారు ఏపనికీ సాహసించేవారు కాదు.

సొసైటీ అంటే గవర్నమెంటు ఆధ్వర్యాన నడిచేసంస్థకదా, కావలసిన వస్తువులు (కర్మవశాత్తు వుంటే) తక్కువధరల్లో సప్లై చేస్తారుకదా అనే ఉద్దేశ్యంతో నిక్కరొకటి కుట్టించుకుందా మనుకొని కాకీగుడ్డకోసం వెళ్ళాను. కృష్ణమూర్తి గజం బద్దఒకటి చేత్తోపట్టుకొని గుడ్డలుచింపుతున్నాడు. ఒకప్రక్కగా సూరన్నగారు కుర్చీ వేసుకు కూర్చున్నారు.

"నిక్కర్లన్నీ చినిగిపోనాయి. ఓ రెండు గజాలు కాకీ యిప్పించండి సూరన్న బాబు గారూ" అన్నాను.

"అరి సన్యాసీ. ఇప్పుడే గంటక్రితం అయిపోయింది. వచ్చిన వాళ్ళందరికీ లేదనకుండా యిచ్చాను. ఇప్పటిదాకా ఎక్కడి కెళ్ళావురా వెర్రి మొకమా?"అన్నారు అభిమానం చూపిస్తూ.

అది నా దురదృష్టమనుకొని తిరుగుమొగం పట్టాను. కలిగిన నిస్పృహని కరింబీడీ సుక్కతో చంపి, ఆ కిళ్ళీకొట్టు దగ్గరే కూర్చుండి పోయాను. కాస్సేపు రాబోయే ఎన్నికల రభస గూర్చి అక్కడికి చేరిన నలుగురు మిత్రులం ముచ్చటించుకున్నాం. ఒక గంటయింది. ఇంతలోనే జరీ అంచుకండువా వేసుకున్న ఓ పెద్ద మనిషి, అతని వెనుక కాకీగుడ్డ మూట పట్టుకున్న ఓ కుర్రాడు కిళ్ళీకొట్టు ముందునుంచి వెడుతున్నారు.

"కాకీగుడ్డ ఎక్కడ దొరికిందిరా మంగారావ్?" అని పలకరించాడు కొట్టుమీద కూర్చున్న అతని మిత్రుడు.

"కారు పైభాగానికి కవరు కుట్టించామని ఇరవై గజాలు సొసైటీలోవుంటే తెస్తున్నాను. ఈ కోటాకి కాకీ ఎక్కడే వచ్చిందట" అన్నారా మంగారావుగారు.

"ఎంతసేపయిందండి మీకిచ్చి?" ఎందుకైనా మంచిదని ఓ చిన్న ప్రశ్న నేనుకూడా వేశాను.

"ఇప్పుడే గదరా నువ్విక్కడ కూర్చుండగానే వెళ్ళాను" అని మాకేంలోటు అన్నట్టుగా వెళ్ళిపోయాడాయన.

నా హృదయం ఒక్కసారిగా కాగితం చింపినట్టుగా అయింది. ఆకస్మికవరదా గమనంలాగ కోపం కట్టలు తెంచుకువచ్చింది. నేరుగా సొసైటీకి వెళ్ళి గుడ్డలు చింపుతున్న కృష్ణమూర్తిని బైటికి పిలిచి ముఖంమీద అడిగేశాను మీ సొసైటీ చాలా మోసం చేస్తోందని.

"సొసైటీ మంచిదే. మనుషులు మాత్రం మోసం" అన్నాడు, కృష్ణమూర్తి.

కృష్ణమూర్తి అన్న యీ పుల్ల విరుపుమాటకు నాకోపం ద్విగుణీకృతమైంది. పర్యవసానం తేల్చుకోకుండా వెనుకంజ వేయకూడదనుకున్నాను.

"నాకంటె గంట వెనకవచ్చిన మంగారావుగారికి గుడ్డయిచ్చి నాకు లేదన్నారేం?" అని రెట్టించి అడిగాను.

"ఇందులో నా తప్పేమీలేదు. నీతో లేదని చెప్పింది యజమాని నేను నౌకర్ని మా యిద్దరి మధ్య సేవాధర్మం అనేది ఒకటుంది. అదిమాత్రం గుర్తించుకో" అని అభిభాషించాడు.

కృష్ణమూర్తి వెంటనే ఏమనాలో నాకు తోచిందికాదు. ఇష్టదైవాన్ని ప్రార్థించుకున్నా కష్టమైంది ప్రత్యుత్తరానికి. నేను చేసేదీ నౌకరీయే కాబట్టి, దాంట్లోని మంచి చెడ్డలు నాకూ అనుభవమే కనుక మౌనం ఉత్తమలక్షణ మనుకొని వెనక్కి తిరిగాను.

"అవును కృష్ణమూర్తి చెప్పిందీ నిజమే. యజమాని చెప్పినట్టు చెయ్యకపోతే సముద్రమంత సంసారం యేమైపోవాలి? అయినా ఈ దేశంలో తరుణోపాయం లేదు?" అని జీవిత లక్ష్యానికి సాధనాల్ని సాధనం చేసుకుంటూ యిల్లు చేరుకున్నాను.

కొన్నాళ్ళకి కృష్ణమూర్తి సొసైటీ ఉద్యోగం వదులుకున్నాడు. కారణం అనూహ్యాం. కృష్ణమూర్తి సొసైటీనుంచి తప్పుకున్న ఆర్నెలకల్లా పంచాయతీ ఎన్నికలొచ్చాయి. ఆ గ్రామానికి కూడా ఎన్నికల తేదీ ప్రకటించబడింది. కృష్ణమూర్తి ప్రెసిడెంటుగా వెంకట్రామయ్యగారికి వ్యతిరేకంగా పోటీచేశాడు కూడాను. సరైన అభ్యర్థులు దొరక్క వెంకట్రామయ్యగారు కొన్ని వార్డుల్లో మాత్రమే తన వర్గంవారిని నిలబెట్టగలిగారు. ఇరుపక్షాల ప్రచారాలతో ఊరంతా ప్రతిధ్వనిస్తోంది. ప్రచారంతో అలసిపోయిన కృష్ణమూర్తి ఆ రోజున భోజనానికి ఆలస్యంగా వచ్చాడు. గబగబా నాలుగు మెతుకులు తినిపోదామని కంచంముందు కూర్చున్నాడు.

ఇంతలోకే "సొసైటీ సొమ్ము పదకొండొందలు కాళీ అయాయి కనుక మేనేజరుగోరైన కిట్టమూర్తిగారి ఆస్తి గవన్నమెంటోరు జప్తు సేత్తారు. కాబట్టి, సదరు ఆస్తి ఎవరూ కొనగూడదహో" అని టముకు వేస్తున్న మాదిగవాని మాటలు వినిపించాయి. ఒక్కసారిగా అతని శరీరమంతా విద్యుత్తు ప్రవహించినట్టుగా అయింది. ఒక మెతుకు కూడా సహించలేదు. భోజనం తినకుండానే లేచిపోయాడు.

హోటల్లో కాఫీ తాగుచుండగా పై టముకు నాచెవిలోకూడా పడింది. తిన్నగా కృష్ణమూర్తి దగ్గర కెళ్ళాడు. జరిగిన వివరమంతా చెప్పుతున్నాను.

"సాధారణంగా అవకాశం దొరికితే జారవిడుచుకునే తత్వంకాదు వెంకటరామయ్యగారిది. ఇక ఆయన చేతిలో మిగిలిన అస్త్రంమాది గప్పూ దాన్ని మనమీద ప్రయోగించాడు. అంతే" అన్నాడు చిరునవ్వుతో.

"నువ్వు డబ్బు అపహరించకుండా టముకు వేయించడానికి అతనికేం అధికారముంది?" అని అడిగాను.

"ప్రస్తుతం మునసబు చేస్తున్న వెంకన్న వీడి చేతిలో కీలుబొమ్మేగా. ఇదంతా వెంకట్రా

మయ్యగారి డైరెక్షను-సూరన్నగారి ప్రొడక్షను. ఈ రెంటి కలయిక ఊళ్ళో రిలీజైంది" అని చమత్కారంగా జవాబిచ్చాడు కృష్ణమూర్తి.

"అయితే వాళ్ళ మోసమేదో యిప్పుడే బయట పెట్టకూడదూ? అనవసరంగా నీమీద ప్రజల్లో దురభిప్రాయం ఏర్పడుతుంది. ఇప్పటికే పరిస్థితి కలుషితమైపోయింది. ఆలస్యం అమృతం విషం" అని చిన్న సలహా యిచ్చాను.

"ఇప్పుడు మనం ఏం చెప్పినా అది ప్రచారంగానే పరిగణింపబడుతుంది. నిజం నిలకడమీదే తేలుతుంది" అన్నాడు నిష్కల్మషంగా.

"అయినా ప్రచారం లోపంమాత్రం చేయకు" అని మాత్రం చెప్పి యింటికొచ్చేశాను.

పోలింగు ప్రశాంతంగా జరిగిపోయింది. వాతావరణం కృష్ణమూర్తికే అనుకూలంగా వుందనుకున్నారు చాలామంది. ఇది విని రెండో రోజున అత్యుత్సాహంతో ఎన్నికల ఫలితాల్ని వినడానికి కౌంటు చేస్తున్న ఆఫీసుకి వెళ్ళాను. ముందు వార్డు అభ్యర్థులని లెక్కపెడుతున్నారు. నెగ్గిన ప్రతి అభ్యర్థి జయ నినాదాలతో వెళ్ళిపోతున్నాడు. ప్రెసిడెంటు వోట్లుకూడా లెక్కపెట్టేశారు. ఫలితంకోసం గుమిగూడిన ప్రజలంతా తదేక దృష్టితో చూస్తున్నారు. ఆఫీసరు ప్రకటించిన రెండు సంఖ్యలూ ములుకుల్లా గుచ్చుకున్నాయి నాకు... కృష్ణమూర్తి ఓడిపోయాడు. నిమిషం కూడా అక్కడ ఆగలేకపోయాను. నిర్జీవంగా కృష్ణమూర్తి ఇంటికెళ్ళాను. కృష్ణమూర్తి నాకోసమే కాబోలు అరుగుమీద కూర్చొని ఎదురు చూస్తున్నాడు. వార్త నెమ్మదిగా వదిలాను.

ఒక్క చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

"ఓటమికి కారణమేమైవుంటుంది? ఇది ప్రజల తప్పా? మన తప్పా?" అని అడిగాను ఉండబట్టలేక.

"ప్రజలదేమాత్రం తప్పులేదు. ఎందుచేతంటే యథార్థం తెలుసుకునే అవకాశం వాళ్ళకులేదు" కృష్ణమూర్తి సమాధానమిచ్చాడు.

"అయితే వెంకట్రామయ్య వేయించిన టముకు చేసిన ప్రచారం ఎంతవరకూనిజమంటావ్? ఇప్పుడైనా చెప్పొచ్చుగా?" అని యింకో ఉప ప్రశ్న వేశాను. "అయితే విను. సొసైటీలో నేను మేనేజరుగా వున్నప్పుడు అగ్రికల్చరల్ డిపార్టుమెంటునుండి డబ్బు తెస్తుండేవాళ్ళం. నాసంతకంతో ఉత్తరం చూపిస్తేనేగాని అక్కడ ఎవరికి డబ్బిచ్చేవారు కాదు. నేను స్వయంగా చాలాసార్లు తెచ్చాను. తెచ్చిన సొమ్మంతా ఎప్పటికప్పుడు మా ఎకౌంటులో జమకట్టేసి నిల్వ సరిపుచ్చుకునేవాణ్ణి. ఒకసారి పదకొండువందలు నా సంతకంతో ప్రెసిడెంటు సూరన్నగారు యింకొకడి ద్వారా తెప్పించి చిట్టాలో జమకట్టకుండా సొంతంగా వాడుకున్నాడు. అప్పుడే నేనడిగాను, నిల్వ చూపించడ మెలాగా అని. ఫరవాలేదు తర్వాత నా సొమ్ము వేసి జమకట్టించేస్తాలే అన్నారు నమ్మకంగా. ఈవిధంగా అవసరమొచ్చినప్పుడల్లా సొసైటీడబ్బు ఆయన వాడుకోడం, అడిటింగ్ వచ్చినపుడు చేబదులుచేసి సొమ్ము నిల్వ సరిపుచ్చడం చాలాసార్లు చేశాం. ప్రెసిడెంటు గారిమీద నమ్మకంకొద్దీ యింతవరకూ వూరుకున్నాను. ఆ అవకాశాన్ని యిప్పుడు వినియోగించుకున్నారు ఇద్దరూ-అంతే" అని ముగించాడు కృష్ణమూర్తి. ఇంతలోనే వెంకట్రామయ్యగారు పుష్పమాలాలంకృతులై జయజయధ్వానాలతో కృష్ణమూర్తి ఇంటిముందునుంచి వూరేగుతూ వెళ్ళిపోయారు.

